
# ఆనందరావూ - అనంతలక్ష్మీ

ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ ఒక ఆఫీసరులా కాకుండా తోటి ఉద్యోగిలా కనిసిమెలిసి తిరిగే పద్మనాభరావు ఆఫీసుకు రాగానే నిప్పులు తొక్కినకోతే అయ్యాడు. "నమస్కారం సార్ నీళ్లు తీసుకోండి" అన్నాడు అటెండర్.

" నీళ్ళు కాదు, ఇంత ఎండ్రిన్ పట్రా



తలో చుక్కా నీట్లో కలుపుకుని తాగేద్దాం" అన్నాడు అగ్గిమీద గుగ్గిలంలా.

తలూపటం తప్పితే ఆలోచించటం తెలీని అప్పారావు, చేతులు ముడుచుకుని "అలాగే సార్!" అని కదలబోయేసరికి.

"ఏమిటి? నిజంగా ఎండ్రిన్నే తెస్తావా? ఫూల్. నీకసలు బుర్రలో ఆలోచన ఉండదు.

"నాకు ఏ నీళ్లూ అక్కరలేదు" అన్నాడు.

అప్పారావు ప్రవర్తనకి, పద్మనాభరావు చిర్రుబుర్రులకీ చుట్టుప్రక్కల సీట్లలో ఉన్న అందరూ కిసుక్కున నవ్వుకున్నారు. వచ్చిన నవ్వుని బయటకు రానివ్వకుండా జాగ్రత్తపడ్డారు.

"ఇదిగో అప్పారావు, నిన్నే. ఇల్లా తగలడు" చిరాగ్గా పిలిచాడు.

"చిత్తం"

"తగలడమంటే పెట్రోలు పోసుకుని, నిప్పంటించుకోనక్కరలేదు. ఇట్రా"

వచ్చి నిలబడ్డాడు.

"స్టాఫ్ అందర్నీ ఇక్కడకోసారి అర్జంటుగా రమ్మను"

అప్పారావు అందరికీ ఈ కబురుంద చేశాడు. అందరూ చేస్తున్న పనులను ఆపేసి

- ఆఫీసరు గదిలోకి చేరుకున్నారు.

"ఆనందరావు వచ్చాడా?" ఎర్రని కళ్లతో, కోపం ముఖం నిండా ఆవరించగా ప్రశ్నించాడా యన.

"ఎస్. సార్!" ఆనందరావు పలికాడు.

"నీకు బుద్ధుందా?"

"ఉంది సార్!" అనుకోకుండా సమాధానం చెప్పిన ఆనందరావు నాలుక్కరుచుకున్నాడు. అందరూ నవ్వుకున్నారు.

"బుద్ధుంటే ఇలాగేనా ఆఫీసులో వర్క్ చేస్తావ్?" చేతిలో ఆ కవరు ఆనందరావు మీదకు విసిరాడు ఆఫీసర్.

"ఏమయింది సార్?" హెడ్ గుమాస్తా అడిగాడు.

"ఆఫీసు మెయింటెనెన్స్, మంత్లీ రిపోర్ట్ హెడ్డాఫీసుకు తయారుచేసి పంపమన్నామా? అతడు తయారుచేసి ఆ రిపోర్టు ఏమిటో అందరికీ చదివి వినిపించండీ" అన్నాడు సీరియస్‌గా.

హెడ్ గుమాస్తా కళ్లజోడు సవరించుకుని, లేడీ స్టెనో మధుమతికిచ్చాడు చదవమని. ఆమె చదవటం ప్రారంభించింది.

"బెల్లం అవకాయ చేసే విధానం :

పాతిక కోలంగోవా గానీ, కలెక్టరు మామిడికాయలుగానీ అప్పుడే చెట్టు నుండి కోసినవి తెచ్చి ఒక దగ్గర ఉంచుకోవాలి. కాయలు తేవటానికి ముందే సన్నావాలు ముప్పావుకేజి, గుంటూరు మిర్చి ముప్పావుకేజీకి కొంచెం తక్కువ సుమారు 650 గ్రాముల సాల్టును సిద్ధం చేసుకోవాలి. నూనె ఒక కేజీ రిఫండాయిలు ఉంచుకోవాలి.

కాయలను నాలుగు ముక్కలుగా చేసి, దబ్బలంతో జాగ్రత్తగా జీడి తీసెయ్యాలి. జీడి తీసినప్పుడు ముక్క రగుడుకాకుండా చూసుకోవాలి. ఒక ప్లాస్టిక్ బకెట్ బాగా తడిలేకుండా తుడిచి ముక్కల్ని వేస్తూ - దానిపై ఆవగుండ, ఉప్పు జల్లాలి. ముక్కలన్నీ వెయ్యటం అయ్యాక, ఇంగువ, బెల్లం వేసి - నూనె పోసి మూత పెట్టాలి. మూడు రోజుల తర్వాత తడి తగలని చేత్తో ముక్కల్ని ఊడ్చి - చాపమీద ఎండ బాగా తగిలినట్టు ఎండ బెట్టాలి. ప్రక్కనే ఊటపై జల్లెడ పెట్టి (తొక్కులు పడకుండా) ఎండ బెట్టాలి. ముక్కలు ఒరుగుల్లా ఎండాక - మనకు కావలసిన సైజులో వాటిని తరుక్కుని ఊట్లో వేసి జాడీ మూత పెట్టి తెల్లని గుడ్డని పైన వేసి - తాడుతో కట్టాలి. నెల రోజుల తర్వాత తీస్తే ముక్క ఊరితింటానికి బాగుంటుంది.

ఇక కారపు ఆపకాయ-

ఇందులో బెల్లం ఒక్కటే మినహాయింపు. గుండా, ఉప్పు వగైరాలు ఒక్కోపావు అధికంగా వెయ్యాలి. ఇంగువ కూడా ఓ పొట్లాం అధికంగా వెల్లుల్లి వాడుకునే వారు రేకులు తీసి ఆవగుండ వేసిన్నాడే వేసుకుంటే ఆవకాయ ఘుమ ఘుమ లాడి చవులూరిస్తుంది.

ఆ తరువాత తొక్కు పచ్చడి, మాగాయి వగైరాలు చేసే విధానం" అని మధుమతి ఇంకా చదవబోతుంటే-

"ఇంక చాలమ్మా! ఇప్పటికే నోరూరిపోతోంది. ఏమయ్యా! ఇది ఆవకాయ అప్పడాల కంపెనీ అనుకున్నావా? నువ్వేదో సిన్సియర్ వర్కర్‌వి అని నీకీ ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ అప్పగిస్తే నీకేం తెగులువట్టు కుందసలు? నువ్వేమయినా కేటరింగ్ బిజినెస్ ఒప్పుకున్నావా? నాకర్థం కావటం లేదు" అని తోక తొక్కిన త్రాచు అయిపోయాడు ఆఫీసరు.

అతని ముందు కూర్చున్న స్టాఫ్ నవ్వాపుకోలేక పోతున్నారు. అదే మామూలు పరిస్థితిలో అయితే పడీపడీ నవ్వేవారే. కానీ ఆఫీసరు ఉగ్రనరసింహ స్వరూపానికి భయపడి బలవంతంగా నవ్వాపుకుంటున్నారు.

ఏసీ రూంలో ఉన్నా ఆనందరావుకి

చెమట్లు పట్టేస్తున్నాయి.

ఆనందరావుకి ఏం చెప్పాలో తెలీటం లేదు. అయోమయంలో పడిపోయాడు.

ఇదంతా అనంతలక్ష్మి అమాయకత్వం వల్ల జరిగిన అనర్థమే!

అనంతలక్ష్మే దీని అంతటికీ కారణం!

పెళ్లయిన నెల రోజులనాడే అనంతలక్ష్మితో హైదరాబాదులో వేరింటి కాపురం పెట్టాడు. ఆనందరావు అన్నం వడ్డించమన్నాడు.

బావురమంది అనంతలక్ష్మి.

"ఏ..... ఏమయింది లక్ష్మీ, చెప్పు..... ఏడువకు" అని బతిమాలితే చెప్పింది. "నాకసలు వంట రాదండీ. ఓ సారి స్టౌ మీద వేపుడు మాడిపోతుందని అమ్మ చూడమంది. నేను చూస్తూనే ఉన్నాను పొగలొచ్చాయి. గొట్రు వచ్చింది. అమ్మ గబగబా వచ్చి 'అయ్యో అయ్యో! వేపుడు మాడిపోతుంటే చూస్తూ ఊరుకున్నావటే. స్టౌ కట్టేయకూ?' అని అరిచింది. 'అదేమో నువ్వుచూడమంటే చూస్తున్నాను, ఇంకా చెప్దామనుకున్నాను అని నేనన్నాను. 'నయం' అని మూకుడితో ఆ వేపుడు అంట్లలో పడేసి, మళ్లీ కూర చేసింది అమ్మ. మరోసారి కుక్కరు ఎలా పెట్టాలో చెప్పింది. గేస్కట్ పాడవటం వల్ల అమ్మ చెప్పినట్టు కూతలు రాలేదు. నేను కూతలొస్తాయి కదాని కూర్చుంటే - ధన్‌మని శబ్దం తో పెద్ద పొగతో ఇల్లల్లా అన్నం చిమ్మేసింది. ఆ తర్వాత అమ్మ నన్ను వంటింట్లోకి పంపలేదండీ" అని చెప్పి కళ్లు తడుచుకుంది.

"సరే. ఈ పూటకి హోటలు నుంచి కేరియర్ తెస్తాన్లే" అని కేరియర్ తెచ్చాడు. ఆ మర్నాటి నుంచీ తనే వంటావార్పూ చేసి ఆఫీసుకెళ్లేవాడు. ఎప్పుడయినా అనంతలక్ష్మి చేత వంట చేయించినా ఆ మర్నాటికి ఉప్పో, కారమో మరి ఉండేద కాదు. నోరు చిల్లుపడడమో జరిగేది.

ఇటువంట పనీ - అటు ఆఫీసు పనీ ఆనందరావుదే అయింది. ఓసారి పక్కింటి పిన్నిగారికి జ్వరం వస్తే - వాళ్లాయన అన్నం ఒక్కటే వండి ఆఫీసుకెళ్తే - అనంతలక్ష్మి కూర పంపింది.

ఓ శ్రావణ మంగళవారం నాడు అనంతలక్ష్మి ఇంటికి ఆడవాళ్లందరూ వచ్చి కూర్చున్నారు. మాటల మధ్యలో - "అనంతలక్ష్మిలా వంటలెవరూ చెయ్యలేరు. మొన్నోరోజు వంకాయ ముద్ద కూర చేసిందీ. నువ్వులపొడి పెట్టి, ఎంత బావుందో? ఆ మధ్య జొరంలో ఉన్నప్పుడు పొట్లకాయ పెరుగుపచ్చడీ - అల్లం అరటికాయ కూరా చేసిందీ - జిహ్వ లేచొచ్చిందనుకో" అని ప్రక్కింటి పిన్ని అనంతలక్ష్మి వంటల గురించి ఏకరవుపెడితే-

అనంతలక్ష్మి ఏమాత్రం తడుము కోకుండా-

"అయ్యో! నా ముఖానికంతపాటే, నాకు అన్నం వండడం కూడా రాదు. నేను మా ఇంట్లో ఓసారి అన్నం వండితే - అది మాడిపోయింది. అడుగు పెచ్చుకట్టేసింది. మా అన్నయ్య 'అమ్మా! ఎవరర్నా, కూరలు వేపుళ్లు చెయ్యటం చూసాంగానీ లక్ష్మి అన్నం వేపుడు కూడా ఎంత బాగా చెయ్యగలదమ్మా! అంటే మా ఇల్లంతా ఒకటే గోల. నేనలిగి కూచుంటే మా నాన్నగారందరి మీదా కేకలేసి నన్ను వంటింట్లోకి పంపితే మా అమ్మని ఇంట్లోంచి గెంటేస్తానన్నారు. అప్పటి నుంచీ వంటింటి ముఖమే తెలియదు" అంది.

"అయితే ఇప్పుడెవరు చేస్తున్నారు వంట మీ ఇంట్లో?"

"మా ఆయనే! ఉదయాన్నే లేచి- అన్ని పనులూ చేసి వంట చేసి నాభోజనం హాట్‌పాక్‌లో సర్దివెళతారు. మీకింకా తెలీదేమో - నాకు బెల్లం ఆవకాయ ఇష్టమంటే ఆయన

ఆ ఆవకాయ పెట్టారు. ఆయనకి గోదావరి జిల్లా ఆవకాయం ఇష్టమని 'బారామసి' కాయలు కొనుక్కుని ఆవకాయం పెట్టుకున్నారు. అప్పడాలు చేస్తారు. మాగాయిలు చేస్తారు. నిమ్మకాయ ఊరగాయ పెడతారు. మీకు తెలుసా? ఉల్లిపాయతో నిలువ పచ్చడి పెడతారు'' అంది భర్త ప్రావీణ్యం గురించి గొప్పగా చెబుతూ, కళ్లు చక్రాల్లా తిప్పింది అనంతలక్ష్మి.

"నిజమా? ఏమదృష్టం! ఏమదృష్టం! మా మొగుళ్లూ ఉన్నారు. స్నానం చేసి, తడిపిన లుంగీని కూడా పిండి ఆరేసుకోరు'' అని ఒకామె అంటే- 'దేనికైనా పెట్టి పుట్టాలి' అంది మరోకామె.

ఆ మర్నాడు -

తడి తువ్వాలతో వంటింట్లో వంట చేస్తున్నాడు ఆనందరావు,

''ఆనందూ! ఆనందూ'' అంటూ ఆనందరావు ఆఫీసులో సూపర్నెంటు వచ్చాడు.

"ఎవరూ?" అంటూ పచ్చడి రుబ్బుతున్న ఆనందరావు ఓ చేత్తో గరిట, మరో చేత్తో నీళ్ల గ్లాసుతో బయటకొచ్చాడు.

''ఏం చేస్తున్నావోయ్?'' అని ఆనందరావు ఆకారం చూసి, "అయితే మా ఆవిడ చెప్పిన మాట నిజమే అన్నమాట. ఏంటోయ్, ఏం చేస్తున్నావు?'' అన్నాడు సూపర్నెంటు.

"ఆ.... అదే సార్! పచ్చడి చేద్దామంటే కరెంటు పోయింది. మరెందుకని......'' ఓ చేతకాని జడ్డి నవ్వు నవ్వాడు.

"బీరకాయ ఉల్లి పెట్టి వండారండీ! ఆ తొక్కు పచ్చడంటే నాకు తెగిష్టం. ఆయనెంత బాగా చేస్తారో'' అని అనంతలక్ష్మి వాక్యం పూర్తి చేసింది.

"నీ తస్సాదియ్యా! పాకశాస్త్ర ప్రవీణుడవే నన్నమాట. అసలు వంట మగాళ్లదేనయ్యా! నలుడూ, భీముడూ ఎవరనుకున్నావు. అది సరే, నువ్వు ఉల్లి నిలవ పచ్చడి బాగా చేస్తావట. నువ్వు చేసిన పచ్చడి రుచికి పంపింది మీ ఆవిడ. చాలా బాగుందోయ్. అక్కడి నుంచీ ఒకటేగోల మా ఆవిడ. ఇవాళో అయిదు కేజీల బందరుల్లి తెచ్చాను. కొంచెం పచ్చడి చేసి పెట్టవోయ్. నీకు ఓ.డి. ఇస్తాన్లే. ఆఫీసర్ గారు రెండ్రోజులు కేంపు. నీ పని నేను చూసుకుంటా. వస్తానోయ్ మరిచిపోవద్దు'' అని అతను సమాధానం వినకుండా వెళ్లిపోతే కుప్పకూలిపోయాడు ఆనందరావు.

''లక్ష్మీ! నా కొంప ముంచావు కదే. మనింట్లో నయితే పర్వాలేదుగానీ ఇలా ఇంటింటికీ చెయ్యమంటే నేనెక్కడ చచ్చేదే'' అంటుండగానే-

పక్కింట్లో డి.టి.ఓ.గారొచ్చి-

"ఆనందరావుగారూ! మీరే ఆపద్బాంధవులు. ఇవి చేతులు కావు. కాళ్లను కోండి'' అని తడి తువ్వాలతో ఉన్న ఆనందరావు దగ్గర ప్రాధేయపడ్డాడు.

"అయ్యో అయ్యో! తండ్రిలాంటివారు. మీరు చేతులు పట్టుకుబ్రతిమాలటమా? చెప్పండి బాబాయిగారూ! ఏమయింది? ఆయనవనరం ఏవొచ్చింది?'' అంది అనంతలక్ష్మి.

"ఏం లేదమ్మా! ఈ రోజు మా అమ్మ గారి తద్దినం. వంటవాణ్ణి పెట్టుకున్నాం. వాళ్లకేదో సమస్య వచ్చిందిట. మరో వంటావిడ దగ్గరకెళ్తే ఆవిడా దొరకలేదు. మా ఆవిడకు జ్వరం. అయినా స్నానం చేసి మడి కట్టుకుంది. కానీ తూలిపోతోంది. ఆనందబాబు వంట బాగా చేస్తాడని తెలిసింది. నాయిన్నాయినా! ఈ పుణ్యం నీదే అవుతుంది. నువ్వే దేవుల్లా కనిపిస్తున్నావు. నా మాట కాదనకు'' అని ఆయన బైతాయించాడు.

ఆనందరావు గొంతుకలో వెలక్కాయ పడింది. నెత్తిమీద పిడుగు పడింది. ఓ ప్రక్క

సూపర్నెంటుకు ఉల్లి పచ్చడి, మరో ప్రక్కన డి.టి.ఓ. గారికితద్దినపు వంట.

"అనంతలక్ష్మీ! నా కొంప ముంచావుకదే! నన్ను వంట వాడ్ని చేశావుకదా! ఇక నాకు దారేదీ?" అని అయోమయంలో పడుతున్న ఆనందరావుని ఏమాత్రం పట్టించుకోని అనంత లక్ష్మి" అయ్యో! అదెంత పనండీ! ఏమండీ, ఆ పచ్చడి సంగతి అలా ఉంచి, ముందు బాబాయిగారింటికెళ్లండి. మీరు వెళ్లండి బాబాయిగారూ! ఆయనిప్పుడే స్నానం చేసుకుని వస్తారు" అంది.

"అక్కడే బాత్రూం ఉంది. అక్కడ పంచాగావంచా కూడా సిద్ధంగా ఉన్నాయి. మీ పిన్ని అసలే ఛాదస్తపు ఘటం"అని డి.టి.ఓ. గారు తన వెంటనే ఆనందరావుని తీసుకెళ్తూ -"నేను సూపర్నెంటుగారికి ఫోన్ చేస్తాలే నాయనా!" అన్నారు.

ఆనందరావు కాళ్లు చచ్చుబడినట్టయి-అనంతలక్ష్మిని తిట్టుకుంటూ నడుస్తూంటే "నిజంగా ఈయన నాకు దొరకటం నా భాగ్యం కదూ బాబాయిగారూ! ఎన్ని జన్మల పుణ్యమో!" అంది.

"ఎంత మాట" డి.టి.ఓ. గారన్నారు.

'నా శార్ధం. నా ఖర్మ. నా దౌర్భగ్యం'. గట్టిగా అరవాలనుకున్న ఆనందరావు నాలుక ఎండలో ఎండపెట్టిన ఆవకాయ ముక్కలా అవటం చేత అరవలేకపోయాడు.

అప్పటి నుంచీ ఎవరింట్లో ఏ కార్యానికైనా వంట మనిషి కుదురకపోయినా అక్కడికి ఆనందరావునే లాక్కుపోవటం - అనంతలక్ష్మి అతన్ని ఒప్పించి పంపటం అలవాటయిపోయింది.

వంటరాని ఆడవాళ్లంతా ఆనందరవుని సలహాలడగటానికి వస్తూంటే - కొంతమంది మెతక మొగుళ్లు చాటుగా ఆనందరావుని తిట్టడం కూడా జరిగింది. "నీ నుంచే మా బ్రతుకులూ తగలడ్డాయి" అని.

ఆ తర్వాత ఆనందరావు 'వంట-వార్పూ' పుస్తకం రాసేందుకు మెటీరియల్ సమకూర్చుకున్నాడు. మొన్న రాత్రంతా ఇంట్లో పనిచేసుకున్న ఆనందరావు - ఏ కవర్లో ఏకాగితం పెట్టాలో చెపితే - అనంతలక్ష్మి అతనికి సహాయం చేసింది. ఆ నిద్రమత్తులో ఎప్పుడు పెట్టేసిందో గానీ ఆ 'వంట-వార్పూ' మెటీరియల్ హెడ్డాఫీసుకు పంపాల్సిన కవర్లో పెట్టేసింది. అతనలాగే ఆఫీసర్ సంతకాలు చేయించి పంపేశాడు.

ఇప్పుడిలా కొంప మునిగింది.

"ఏంటీ? అలా గుడ్లప్పగించి చూస్తావేంటి? నిన్ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయమన్నారు ఎం-డీ గారు. నిన్ను సస్పెండ్ చేస్తున్నాను" అన్నాడాయన సీరియస్‌గా.

"సార్! పొరపాటయింది. ఇకపై ఇలాంటి తప్పులు దొర్లనివ్వను. ఇది మొదటి తప్పుగా భావించి మన్నించండి సార్!" కళ్లనీళ్లతో అర్ధించాడు ఆనందరావు.

ఆనందరావు ఎఫిషియంట్ వర్కర్ కావటాన అందరూ అతన్ని సపోర్ట్‌చేశారు.

"సరే! నేను ఎండీ గారికి చేస్తానులే. కానీ ఇది మీకు హెచ్చరికే. అందరూ వళ్లు దగ్గర పెట్టుకుని పనులుచేసి, ఆఫీసుకు మంచి పేరు తేవటానికి ప్రయత్నించండి" అని ముగిస్తున్నంతలో - ఫోన్ మోగింది. "హలో... నమస్తే సార్! అలాగే... అలాగే. ఇప్పుడే రిలీవ్ చేస్తా. నమస్తే సార్ ఉంటా సార్!" అని ఫోన్ పెట్టేసి. "మన సమస్యకు పరిష్కారం దొరికింది. ఎండీ గార్నించి ఫోన్. ఆనందరావుని ప్రమోషన్ మీద హెడ్డాఫీసుకు బదిలీ చేస్తున్నారు, ఈరోజే రిలీవ్ చేయమన్నారు. రేపు ఫ్లయిట్‌లో బాంబే పంపమన్నారు. మళ్లీ ఆయన అమెరికా వెళ్తున్నారట" అన్నాడు ఆఫీసర్. ఆ తర్వాత ఆనందరావు వైపు చేసి-

"మిస్టర్ ఆనంద్! కంగ్రాట్స్" అన్నాడు.

"సార్! నాకేం అర్థం కావటం లేదు. ఇది నిజంగా నిజమా? తప్పు చేస్తే రివర్షనో, సస్పెన్షనో, ఊష్టింగో ఇస్తారు. నాకు ప్రమోషనేంటి సార్?" అన్నాడు. "అదే, అంతుబట్టడం లేదు మాక్కూడా?" అన్నాడయన గడ్డం సరిచేసుకుంటూ.

"లక్ష్మీ! ఉద్యోగం ఊడుతుందనుకున్నాను. కానీ ప్రమోషనొచ్చింది. ఇక అక్కడయినా నా వంటావార్పూ గురించి చాటింపులు వెయ్యక నోరు మూసుకో. లేకపోతే తద్దినం వంటలూ పెళ్లివంటలూ చెయ్యలేక ఛస్తున్నా" అన్నాడు ఆనందరావు సీరియస్‌గా.

"ఏమండీ! ఆ బొంబాయిలో ఎప్పుడూ బాంబులూ, పేలుళ్లూ. భయం భయంగా వుంటుందండీ. ఎలానో బతిమాలి ఈ ట్రాన్స్‌ఫర్ కేన్సిల్ చేయించుకోండి. మనం లేకపోతే చుట్టుపక్కల వారు ఉండలేరటండీ! మీ చేతి వంటకాలు తినకపోతే డి.టి.ఓ. పిన్నిగారికి భోజనం హితవు కాదుటండీ. మీరు చేసిన కూరలు తిన్నాకే ఆవిడ ఆరోగ్యం బావుందిట" అని బుజ్జగిస్తున్నట్టు అంది అనంతలక్ష్మి

"లక్ష్మీ! నువ్వు గ్రాడ్యుయేషన్ ఎలా చేశావో నాకర్థం కావట్లేదు. నేనొక్క క్షణం ఈ ఊళ్లో ఉండను. కంప్యూటర్లో నాకున్న ఘనతంతా మరుగునపడి నీనుంచి వంటవాడి అవతారం ఎత్తాల్సి వచ్చింది. నేనిక ఛస్తే ఇక్కడుండను. ఉండనుగాక ఉండను" అని శివతాండవం చేశాడు ఆనంతరావు.

"ఏం చేస్తాం. సరే మీ ఇష్టం" నీర్సంగా అంది అనంతలక్ష్మి

. - . - . - . - . - . - . - . -

"కూర్చో మిస్టర్ ఆనంద్"

"పర్వాలేదండీ!" వణుకుతూనే నిలుచున్నాడు ఆనందరావు.

"నిన్నిక్కడకు ప్రమోషన్ మీద తీసుకొచ్చింది ఎందుకో తెలుసా?" కళ్లజోడు సవరించుకుంటూ అడిగాడు ఎండీ.

"తెలీదండీ!"

"ముందు కూర్చో"

ఎండీ బెల్లుకొట్టాడు. అటెండరు వచ్చాడు. రెండు కూల్ డ్రింకులు తెమ్మన్నాడు.

"ఇది నా ఇల్లు, ఆఫీసు కాదు భయం లేదు. కూర్చో నేనూ తెలుగు వాణ్ణే. తెలుగు వాళ్లంటే నాకు వల్లమాలిన అభిమానం బైదిబై నీకిదే ఆఫీసు, తెలుగు వంటకాలు తిని కొన్నేళ్లయిపోయింది. మా ఆవిడ వంట్లో శక్తి సన్నగిల్లింది. ఇక్కడ కుక్స్‌కి మడీతడీ తెలీదు. సో-నీకు మార్నింగ్ తొమ్మిది వరకూ సాయంకాలం ఏడు నుంచి ఎనిమిది వరకే పని. నువ్వు మడి కట్టుకుని ఆవిడకు కావలసిన వంటలు వండి పెట్టడమే. బయట ప్రపంచానికి ఈ విషయం తెలియనివ్వను. నువ్వు చింత చిగురు పప్పు, పచ్చడి బాగా చేస్తావట. మొన్న నువ్వు పంపిన పొరపాటు కవరుని మా ఆవిడ జిరాక్స్ తీయించి చదువుకుంది. ఆ రాత్రి ఆమే సలహా యిచ్చింది. నీకు ప్రమోషన్ ఇచ్చి - ఇక్కడకు రప్పించమని. నువ్విందుకు ఇష్టపడితే సరి! లేదా, ఇదిగో ఇది చూడు" అని మరో కాగితం అందించాడు.

అది ఊష్టింగార్డరు.

నిలువునా పెనుగాలిలో లతలా వణికిపోయాడు ఆనందరావు.

అతని బుర్ర మొద్దుబారిపోయింది. మరో ఆలోచన రాలేదు.

"సార్! మీ కండిషన్‌కి నేను అంగీకరిస్తాను, కానీ ఈ విషయం రెండో కంటికి తెలీనివ్వకండి సార్. ఇది నా స్పెషల్ రిక్వెస్ట్" మెల్లగా అన్నాడు ఆనందరావు.

"ఒకే కంగ్రాట్స్. ప్రొసీడ్!" కరచాలనం

చేశాడు ఎం డీ.

. . . . . . . . . . . .

పుస్తకం చదువుతోన్న అనంతలక్ష్మి ఫోన్ రింగ్‌వటంతో వెళ్లింది.

"హలో....."

"నేనమ్మా ఎం డీ బాబాయిని"

"నమస్తే బాబాయి. ఏంటి చెప్పండీ"

"మీ ఆయన నిజంగానే పాకశాస్త్ర ప్రవీణుడమ్మా. అతని వంటలు తింటుంటే అమృతం తగుతున్నట్టుంటోంది. కానీ, ఎంతకాలం అతనికీ పనిష్మెంటు చెప్పు, పాపం...." అన్నాడు ఎం డీ.

పకపకా నవ్వేసింది అనంతలక్ష్మి.

"నాకు త్వరలో బాబో, పాపో పుట్టబోతున్నారు. ఆ తర్వాత నేను నా పనులు స్వంతంగా చేసుకున్నంత వరకూ. అంతవరకూ అది రహస్యంగా ఉంచండి"

"మొత్తం మీద బాగా సాధించావే"

"ఇంకా చాలదు బాబాయ్ నిజంగా అయితే లక్షల కట్నం తీసుకుని అది చాలదూ, ఇది చాలదూ అని వాళ్లక్కయ్యలూ, బావలూ పెళ్లిపీటల మీదనుంచి లేచిపొమంటే, ఇతను లేచిపోవటమేనా? నాన్నా అమ్మా ఎంత ఏడ్చారో తెలుసా? అక్కయితే అక్కడే ఆ సంబంధం వదిలేసుకోమంది. అప్పుడే నేను గమనించాను. ఇత డెత్తువారి చతిబిడ్డడని. మీరే ఈయనకి ఎం డీ గారని. మా విజయ చెప్పటంతో నాకసి తీరింది" అంది.

"ఓకే. నీ పర్మిషనయితే మీ ఆయనకి విముక్తి కలిగిస్తా. ఉంటా"

"బై".